

3, 4న వైవీయూలో విద్యార్థులకు క్విజ్ పోటీలు

కడప అర్బన్: రాష్ట్ర ఉన్నత విద్యా మండలి మార్గదర్శకం మేరకు వైవీయూలో ప్రాంతీయ స్థాయి క్విజ్ ఛాంపియన్ షిప్-2023 పోటీలు ఈ నెల 3, 4వ తేదీలలో నిర్వహిస్తున్నట్లు వైవీయూ ఆంగ్ల శాఖ సహఆచార్యులు, క్విజ్ నిర్వాహకులు డాక్టర్ ఆర్.వి.జయంత్ కశ్యప్, ఉన్నత విద్యా మండలి క్విజ్ సమన్వయకర్త ఎం.రమేష్ కుమార్ ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. ప్రారంభ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వైవీయూ విసి ఆచార్య జింక రంగా జనార్ధన్, ప్రత్యేక అతిథులుగా రిజిస్ట్రార్ ఆచార్య వై.పి.వెంకట సుబ్బయ్య, కళాశాల ప్రిన్సి పల్ ఆచార్య కృష్ణారెడ్డి, పరిశీలకులుగా ఆప్స్కి అకాడమిక్ కన్సల్టెంట్ డాక్టర్ బి.ఎల్లారెడ్డి, యంగ్ ప్రొఫెషనల్ నగేష్ హాజరవుతున్నారని పేర్కొన్నారు. క్విజ్ పోటీలకు రాయలసీమ, నెల్లూరు ప్రాంతాలలోని వివిధ కళాశాలలు, విశ్వవిద్యాలయాల నుంచి 33 టీములు హాజరవుతున్నాయని తెలిపారు. క్విజ్ పోటీలు ప్రిలిమ్స్, క్వాలిఫైయింగ్, క్వార్టర్ ఫైనల్స్ ఇలా మూడు దశల్లో ఉంటాయని పేర్కొన్నారు. విజేతలకు సెమీఫైనల్ ఉంటుందని తెలిపారు.



గ్యాస్ బండ

కేంద్ర ప్రభుత్వం మరోసారి గ్యాస్ ధరలను పెంచేసింది. 2022 జులై ఐదున సిలిండర్‌కు రూ.50 చొప్పన పెంచిన సంగతి తెలిసిందే. ఎనిమిది నెలల వ్యవధిలో మరోసారి రూ.50 పెంచడం చర్చనీయాంశంగా మారింది. 2022 మార్చి, మే ఏడు, జులై ఏడు, తాజాగా మార్చి నెలలతో కలిపి లెక్కిస్తే నాలుగు దఫాలకుపైగా పెంచింది. వరుస ధరల పెరుగుదల ఆయిల్ కంపెనీలకు లాభాల పంటను పండిస్తోంది. రష్యా, ఉక్రెయిన్ యుద్ధం పేరుతో గ్యాస్ ధర లను పెంచుతోంది. తాజాగా బుధవారం ఉదయం గ్యాస్ ధరలను పెంచేసింది. ఫలితంగా జిల్లాపై నెలకు సుమారు రూ.3.5 కోట్ల మే రకు భారం పడనున్నట్లు ఓ అంచనా.

- సిలిండర్‌పై రూ.50 పెంపు
- జిల్లాపై రూ.3.5 కోట్ల భారం?!

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

కేంద్ర ప్రభుత్వం వంటింట్లో మంట పెట్టింది. బుధవారం డొమెస్టిక్ గ్యాస్ ధరను రూ.50 మేరకు పెంచేసింది. ప్రకటిత రోజు నుంచి రూ.50 గ్యాస్ ధరను అమలు చేయనుంది. ఫలితంగా గృహిణుల ఖాతాలకు చిల్లుపెట్టింది. ఒకవైపు నిత్యా వసరాలు, కూరగాయల ధరలు మండుతుండగా, మరోవైపు గ్యాస్ ఛార్జీల రూపంలో మహిళల మనీ ప్యాకెట్లను ఖాళీ చేస్తోంది. ఉమ్మడి కడప జిల్లాలోని 8.12 లక్షల కుటుంబాలపై పెనుభారం పడింది. 2021 ఫిబ్రవరి, మార్చి, జులై, 2022 మార్చి 23, మే, జులై, 20 23 మార్చి మాసాల కలిపితే ఏడు దఫాలుగా రూ.325 మేరకు ధరలను పెంచేసింది. ఈనేపథ్యంలో జిల్లాలో భారత్, హెచ్‌పి, ఇండేన్ గ్యాస్ ఏజెన్సీలు గ్యాస్ సరఫరా కార్యకలాపాలను సాగిస్తున్నాయి. జిల్లాలో 8,12,013 గ్యాస్ కనెక్షన్లు ఉన్నాయి. ప్రతి నెలా సుమారు ఎనిమిది లక్షల సిలిండర్లు సరఫరా చేస్తున్నట్లు అంచనా. ఇం డేన్ గ్యాస్ ఏజెన్సీ సుమారు నాలుగు లక్షలు, హెచ్‌పిసిఎల్ 2.64 లక్షలు, బిపిసిఎల్ 1.26 లక్షల సిలిండర్లను సరఫరా చేస్తున్నాయి. రోజుకు సగటున 28 వేల చొప్పన నెలకు ఎనిమిది లక్షల సిలిండ ర్లు వినియోగమవుతున్నట్లు అంచనా. గతంలో సిలిండర్‌కు రూ.1050 చొప్పన సిలిండర్‌ను చెల్లించాల్సి వచ్చేది. తాజా పెంపుదలతో రూ.1,155 చేరుకుంది. గతంలో గ్యాస్ సబ్సిడీ కస్టమర్ల ఖాతాల్లో జమ చేసేలా మార్పులు చేసిన సంగతి తెలిసిందే. చాలా మంది కస్టమర్ల ఖాతాల్లో సబ్సిడీ జమ కావడం లేదనే వాదన వినిపిస్తోంది. సబ్సిడీ సొమ్ము వినియోగదారుల ఖాతాల్లో జమ చేయకపోవడం, మరోవైపు ఉన్న ఫళంగా గ్యాస్ ధరలను పెంచండం పట్ల ఆందోళన వ్యక్తమవుతోంది. రెండేళ్ల నుంచి గ్యాస్ ధరల పెంపు వివరాలను ఓసారి పరిశీలిస్తే 2021 ఫిబ్రవరి 4న రూ.25, మార్చి 15న రూ.50, జులై 25న రూ.25,2022 మార్చి ఒకటిన రూ.25, మార్చి 23న రూ.50, మే ఏడున రూ.50, జులై 7న తాజాగా రూ.50 చొప్పన పెంచుతూ పోయింది. ఫలితంగా సిలిండర్ ధరకు రవాణా ఛార్జీని రూ.40 కలిపితే రూ.1,195 ముట్ట జెప్పుకోవాల్సి వస్తోంది. ఈలెక్కన జిల్లాపై సుమారు రూ.3.5 కోట్ల వరకు భారం పడుతున్నట్లు ఓ అంచనా. కాగా కమర్షియల్ సిలిండర్‌పై రూ.350 పెంచడటం గమనార్హం.

భారాలు మోపడం తగదు : సిపిఎం

ప్రజాశక్తి-కడప అర్బన్

వంట గ్యాస్ సిలిండర్ ధరపై రూ.50 పెంచడంతో వినియోగదారులకు తీవ్రమైన భారంగా మారుతుందని, తక్షణమే తగ్గించాలని సిపిఎం నగర కార్యదర్శి రామ్మోహన్ డిమాండ్ చేశారు. బుధవారం సిపిఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం వంటగ్యాస్‌పై రూ.50 పెంచడం దుర్మార్గమని చెప్పారు. ఇప్పటికే అసంఘటితరంగ కార్మికులు, సామాన్య, మధ్య తరగతి ప్రజలు రోజురోజుకు పెరుగుతున్న భారాలను భరించలేని స్థితిలోకి నెట్టబడ్డారని పేర్కొన్నారు. సామాన్య ప్రజల ఆదాయం, కార్మికుల, ఉద్యోగుల వేతనాలు పెరగకపోవడం, ధరల పెరుగుదల వల్ల ప్రజలు అష్టకష్టాలు పడుతున్నారన్నారు. ఈ విధానాన్ని ప్రజానీకం తీవ్రంగా వ్యతిరేకించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సిపిఎం నగర కార్యదర్శివర్గ సభ్యులు చంద్రారెడ్డి, నగర కమిటీ సభ్యులు డి.ఎం.ఓబులేసు, ఫారుక్ హుస్సేన్, ఎమ్మార్ నాయక్ పాల్గొన్నారు. **జమ్మలమడుగు రూరల్ :** గ్యాస్ ధర పెంపు వినియోగదారులకు తీవ్రమైన భారంగా మారుతుందని తక్షణమే తగ్గించాలని సిపిఎం జమ్మలమడుగు కార్యదర్శి వీరనాల శివ నారాయణ డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం వంటగ్యాస్‌పై రూ.50 పెంచడం దుర్మార్గ మన్నారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు కృష్ణ, ఎల్లయ్య, మధు, సుబ్బన్న పాల్గొన్నారు.

పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థులను గెలిపించండి

- సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ



సమావేశంలో మాట్లాడుతున్న రామకృష్ణ

ప్రజాశక్తి-కడప అర్బన్

ప్రజల పక్షం నిలబడే పిడిఎఫ్ పశ్చిమ రాయలసీమ శాసనమండలి ఉపా ధ్యాయ అభ్యర్థి కత్తి నరసింహారెడ్డి, పట్టభద్రుల అభ్యర్థి పోతుల నాగరాజును గెలిపించాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ పిలుపునిచ్చారు. బుధవారం యుటిఎఫ్ కార్యాలయంలో ఎన్నికల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రామకృష్ణ, ఎస్‌టియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తిమ్మన్న మాట్లాడుతూ ప్రజా, ఉద్యోగుల వ్యతిరేక విధానాలను ప్రశ్నించేందుకు ప్రతిపక్షాలు ఉండాలని పేర్కొ న్నారు. అందుకోసం నిరంతరం ప్రజల పక్షం నిలబడి వారి కోసం పోరాడుతున్న వారు శాసనమండలి ఎన్నికలలో నిలిచారని గెలిపించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందని తెలిపారు. రాష్ట్రంలో అధికారంలో ఉన్న ప్రభుత్వం ఉద్యోగులపై కక్ష సాధింపు చర్యలు పాల్పడు తుందన్నారు. న్యాయమైన కోరికలను పరిష్కరించకుండా భయభ్రాంతులకు గురిచేస్తుందన్నారు. పాఠశాల విలీనం పేరుతో విద్యా వ్యవస్థను ధ్వంసం చేసిందని విమర్శించారు. ఖాళీగా ఉన్న ఉపా ధ్యాయ, ఉద్యోగాలు భర్తీ చేస్తామని చెప్పి మిగులు ఉపాధ్యాయులను చూపిం చటం దుర్మార్గమన్నారు. ప్రతి సంవత్సరం జాబ్ క్యాలెండర్ ప్రకటించి ఖాళీగా ఉన్న ఉద్యోగాలు భర్తీ చేస్తామని చెప్పి నిరుద్యోగులను నట్టేట ముంచిందన్నారు. పాఠశాల, కళాశాలలో ఉపా ధ్యాయ, ఉద్యోగాలు, ఎపిపిఎస్‌సి గ్రూప్ 1, 2, 3, 4 ఇంజినీరింగ్ ఇతర శాఖలలో అనేక ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయని వాటిని వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. గతంలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా ఎన్నికై ఉపాధ్యాయులు విద్యారంగ, విద్యాభివృద్ధి కోసం అనేక పోరాటాలు, చట్టసభల్లో మాట్లాడిన కత్తి నరసింహారెడ్డి, పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా సామాజిక పోరాటాలలో క్రియాశీలక పాత్ర పోషించి నిరుద్యోగుల పక్షాన నిలబడి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు, రాయలసీమ ప్రాంత అభివృద్ధి కోసం కృషి చేస్తున్న పోతుల నాగరాజును గెలిపించి చట్టసభలకు పంపించాలన్నారు. అధికార పార్టీకి శాసనసభలో, శాసనమండలిలో అత్యధిక మెజార్టీ ఉందని వాళ్ల ఆడింది ఆట పాడిందే పాటగా ఇష్టానుసారంగా ప్రజాస్వామ్యాన్ని కూనిచేస్తూ ఉద్యోగులపై కక్ష కట్టారన్నారు. ప్రశ్నించే గొంతులను అణచివేస్తూ ప్రజాస్వామ్యాన్ని కూని చేస్తున్నారన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రజల పక్షాన నిలబడి మాట్లాడే పట్టభద్రుల అభ్యర్థి పోతుల నాగరాజు, ఉపాధ్యాయ అభ్యర్థి కత్తి నరసింహారెడ్డి అండగా నిలిచి వారిని గెలిపించి చట్టసభలకు పంపించాలన్నారు. సమావేశంలో సిపిఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర, ఎఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లెనిన్ బాబు, ఎఐ ఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు జాన్సన్ బాబు, శివారెడ్డి, యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బి.లక్ష్మి రాజ, ఎస్‌టియు జిల్లా అధ్యక్షులు రమణారెడ్డి, యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు విజయ్ కుమార్, సిపిఐ జిల్లా కార్యవర్గసభ్యులు ఎల్.నాగ సుబ్బారెడ్డి, పులి కృష్ణమూర్తి, సుబ్బారెడ్డి, చంద్రశేఖర్, సుబ్బరాయుడు, వెంక టశివ, బాదుల్లా, విజయలక్ష్మి, సుబ్రహ్మణ్యం, శ్రీరాములు, జిల్లా సమితి సభ్యులు వెంకట్రాయుడు, జకరయ్య, మద్దిలేటి, ఈశ్వరయ్య, మస్తాన్, షరీఫ్, ఎఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు దస్తగిరి, ఎఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు పవన్ కుమార్ పాల్గొన్నారు.

'మండలి' ఎన్నికల నిర్వహణపై ప్రత్యేక దృష్టి : కలెక్టర్



మాట్లాడుతున్న కలెక్టర్ విజయ్ రామరాజు

ప్రజాశక్తి - కడప

శాసనమండలి ఎన్నికలను పగడ్బందీగా, ప్రశాంతంగా నిర్వహించేందుకు అన్ని చర్యలను చేపడుతున్నామని కలెక్టర్ వి.విజయ్‌రామరాజు రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ముఖేష్ కుమార్ మీనాకు తెలియజేశారు. శాసన మండలి ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లపై అమరావతి నుండి బుధవారం రాష్ట్ర ఎన్నికల కమిషనర్ ముఖేష్ కుమార్ మీనా ఆయా జిల్లాల కలెక్టర్లు, జెసిలు, డిఆర్‌ఒలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టరేట్ బోర్డు మీటింగ్ హాలు నుండి జిల్లా కలెక్టర్ వి.విజయ్ రామరాజు, జెసి సి.ఎం.సాయి కాంత్ వర్మ, ఎస్‌పి తుషార్ డూడీ, డిఆర్‌ఒ గంగాధర్ గౌడ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వి.విజయ్ రామరాజు విసి ద్వారా రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారితో మాట్లాడుతూ ఎన్నికల సంఘం జారీచేసిన మార్గదర్శకాల మేరకు జిల్లాలో ఎమ్మెల్సీ ఎన్నికలను విజవంతం చేసేందుకు ఏర్పాట్లను ప్రణాళిక ప్రకారం సంసిద్ధం చేస్తున్నామని తెలియజేశారు. ఎన్నికల విధుల్లో అనుభవం ఉన్న అధికారులను ఏర్పాటు చేసుకుని ఎన్నికల నిర్వహణలో ఎటువంటి లోటు పాట్లు లేకుండా ఎన్నికల విధులను చేపడుతున్నామన్నారు. ఇప్పటికే పీవోలు, ఏపీవోలకు, మైక్రో అబ్జర్వర్స్ కు ఎన్నికల నిర్వహణపై శిక్షణ ఇవ్వడం ప్రారంభించామని తెలిపారు. 6వ తేదీ లోపు పూర్తి చేస్తామన్నారు. జిల్లాలో ఇప్పటికే 131 పోలింగ్ కేంద్రాలను సిద్ధం చేశామన్నారు. ఎన్నికల నిర్వహణ సిబ్బందికి సంబంధించి 191 పీవోలు, 191 ఏపీవోలు, 393 ఓపీవోలను నియమించామన్నారు. పోలింగ్ మెటీరియల్ కొనుగోలు ప్రక్రియ కూడా జరుగుతోందన్నారు. బ్యాలెట్ బాక్సులు, బ్యాలెట్ పేపర్స్ ను సిద్ధం చేసుకోవడం జరిగిందన్నారు. జిల్లాలో 37 సమస్యాత్మక పోలింగ్ స్టేషన్లను కూడా గుర్తించి అదనపు భద్రతా సిబ్బందిని సిద్ధం చేశామన్నారు. వెబ్ కాస్టింగ్ కోసం ఇంజనీరింగ్ విద్యార్థులను తీసుకోవడం జరుగుతోందన్నారు. 1517 మంది పోలీసు బందోబస్తును సిద్ధం చేసుకున్నామని, 82మ శాతంకుపైగా ఆధార్ కలెక్షన్ పూర్తి చేశామన్నారు. పోస్టల్ బ్యాలెట్ వివరాలను కూడా సేకరిస్తున్నామని, స్ట్రాంగ్ రూమ్ భవనాలను కూడా గుర్తించి ఏర్పాట్లు చేస్తున్నామని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారికి కలెక్టర్ వివరించారు. అంతకు మునుపు విసి ద్వారా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా మాట్లాడుతూ.. ఎన్నికలు జరిగే జిల్లాల్లో ఇప్పటికే ప్రకటించిన పోలింగ్ కేంద్రాల్లో పోలింగ్ మెటీరియల్ చెక్ లిస్టు ఆధారంగా పోలింగ్ ముందు రోజే చేరుకొని ఏర్పాట్ల సరిచుసుకోవాలని తెలిపారు, పోలింగ్ రోజు పోలీస్ బద్రత, ప్రిసైడింగ్ అధికారి డైరీ నిర్వహణ, ప్రశాంత పోలింగ్ నిర్వహణ, ఓటరు గుర్తింపు కార్డుతో ఓటు హక్కు వినియోగం, సూక్ష్మ పరిశీలకుల నివేదిక, వెబ్ కాస్టింగ్, వీడియో నిర్వహణ, పరిసరాల్లో ఎలక్షన్ కోడ్ అమలు, పోలింగ్ ముగింపు తర్వాత బ్యాలెట్ బాక్సుల భద్రత, ఓట్ల లెక్కింపు వంటి అంశాలపై ఆయా జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలతో సమీక్షించారు. ఎన్నికలు జరిగే ఆయా జిల్లాల పరిస్థితులను బట్టి ఎక్కడా ఎటువంటి సమస్య లేకుండా ఎన్నికలు జరిగేందుకు ఇప్పటినుంచి చర్యలు చేపట్టాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో ఎన్నికల నిర్వహణ అధికారులు, కలెక్టరేట్ సూపరింటెండెంట్ శివారెడ్డి తదితర అధికారులు పాల్గొన్నారు.

అక్రమాలపై విచారణ జరపాలి : యుటిఎఫ్

ప్రజాశక్తి-కడప అర్బన్



డిఇఒ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న యుటిఎఫ్ నాయకులు

ఇటీవల జరిగిన ఉపాధ్యాయుల పని సర్దుబాటు విషయంలో కడప జిల్లా డిఇఒ దేవరాజు అక్రమాలకు పాల్ప డుతూ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీరాజ, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాదన విజయ కుమార్, పాలెం మహేష్ బాబు పేర్కొన్నారు. ఉపాధ్యాయుల పనిసర్దుబాటులో ఇష్టారాజ్యంగా వ్యవహరించడం పట్ల అభ్యంతరం వ్యక్తం చేస్తూ వినతిపత్రం ఇవ్వడానికి వచ్చిన యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శుల పట్ల డిఇఒ దురుసుగా ప్రవర్తిస్తూ బెదిరింపులకు పాల్పడడానికి నిరసిస్తూ యుటిఎఫ్ ఆధ్వర్యంలో బుధవారం రాత్రి డిఇఒ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధ్యాయుల పని సర్దుబాట్ల విషయంలో ఇష్టారాజ్యంగా వ్యవహరించడం పట్ల అభ్యంతరం వ్యక్తం చేస్తూ, సమస్యలను పరిష్కరించాలని యుటియఫ్ ప్రాతినిధ్యం చేయగా డిఇఒ ఛాంబర్, కార్యాలయం నుంచి బయటకు వెళ్లాలంటూ బెదిరిస్తూ దురుసుగా ప్రవర్తించడం తగదని పేర్కొన్నారు. తనకు ఇష్టం వచ్చినట్లు పని సర్దుబాటు చేస్తానని ప్రభుత్వ ఉత్తర్వులను సైతం తాను లెక్కచేయనని మీరు ఏం చేసుకుంటారో చేసుకోకండి అంటూ కేకలు వేయడం డిఇఒకు తగదన్నారు. ప్రభుత్వ నియమ నిబంధనలను మేరకు మాత్రమే పని సర్దుబాటు చేయాలి తప్ప డిఇఒ ఇష్టం వచ్చినట్లు చేయడానికి వీలు లేదన్నారు. డిఇఒ వెంటనే ఏవైతే అక్రమ పని సర్దుబాట్లు చేశారో వాటిని వెంటనే సవరించి ప్రభుత్వ నిబంధనల మేరకు నిర్వహించాలని లేనిపక్షంలో కడప జిల్లా కలెక్టర్‌కు విద్యాశాఖ ఉన్నతాధికారులకు ఆయనపై ఫిర్యాదు చేస్తామని తెలిపారు. కార్య క్రమంలో జిల్లా కార్యదర్శులు సి.వి.రమణ, ఏజస్ అహమద్ నాయకులు కరి ముల్లా, గోపీనాథ్, కిరణ్ కుమార్, దేవదత్తం, సూర్యకుమార్, శివశంకర్ పాల్గొన్నారు.

సంక్షేమ హాస్టళ్లను బాధ్యతతో నిర్వహించాలి

కడప: సంక్షేమ హాస్టళ్లలో విద్యార్థుల సౌకర్యాలకు ఎలాంటి కొరత లేకుండా బాధ్యతతో చర్యలు చేపట్టాలని కలెక్టర్ వి.విజయ్‌రామరాజు జిల్లా సంక్షేమ శాఖల అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో సంక్షేమ వసతి గృహాల్లో వసతులు, సదుపాయలపై ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్షేమ హాస్టళ్లలో వార్డెన్లు, పిల్లలని సొంత బిడ్డల్లా సంరక్షించాలని, పిల్లల సంక్షేమంలో ఏ మాత్రం కొరత లేకుండా చూడాలన్నారు. ముఖ్యంగా సంక్షేమ హాస్టళ్లలో చదివే విద్యార్థుల ఉత్తీర?తా శాతాన్ని పెంచేందుకు ఆయా శాఖల జిల్లా సంక్షేమ అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఈ విద్యా సంవత్సరంలో 10వ తరగతి చదివే హాస్టల్ విద్యార్థుల ఉత్తీర్ణత శాతాన్ని 100 శాతానికి పెంచేందుకు కృషి చేయాలన్నారు. విద్యార్థులకు అన్నిరకాల సదుపాయాలను సమకూరుస్తూ.. విద్య బుద్ధులు, నైతిక విలువలను పెంచేందుకు ప్రత్యేక శిక్షణా తరగతులు నిర్వహించాలన్నారు. క్రమం తప్పకుండా పిల్లలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించాలన్నారు. సంక్షేమ హాస్టళ్ల సొంత భవనాల ఏర్పాటుకు చర్యలు చేపడతామన్నారు. కార్యక్రమంలో సాంఘిక సంక్షేమ శాఖ జెడి జయప్రకాష్, ఎస్సీ, ఎస్టీ కార్పొరేషన్ ఇడి డాక్టర్ హెచ్.వెంకట సుబ్బయ్య, మైనారిటీ కార్పొరేషన్, బిసి సంక్షేమ శాఖ అధికారి డాక్టర్ వి.బ్రహ్మయ్య, ఐసిడిఎస్ పీడీ ఎం.ఎన్.రాణి, డిజేబుల్, మైనారిటీ సంక్షేమ శాఖా అధికారి కృష్ణకిశోర్, తదితర అధికారులు పాల్గొన్నారు.

పకడ్బందీగా ఎమ్మెల్సీ ఎన్నికలు : ఆర్‌డిఒ

కడప: ఎమ్మెల్సీ ఎన్నికలను పకడ్బందీగా, పారదర్శకంగా నిర్వహిద్దామని ఆర్‌డిఒ ధర్మచంద్రారెడ్డి అన్నారు. బుధవారం స్థానిక కలెక్టరేట్‌లోని సభా భవనంలో ఎమ్మెల్సీ ఎన్నికల పిఒ, ఎపిఒ, సెక్టోరల్, రూట్ ఆఫీసర్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికలు నిర్వహణలో అలసత్వం వహించిన అధికారుల పైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రతి ఒక్కరూ మోడల్ కోడ్ ఆఫ్ కండక్టుకు లోబడి పని చేయాలని తెలిపారు. ఈనెల 13న ఎమ్మెల్సీ టీచర్స్, పట్టభద్రుల ఎలక్షన్ పోలింగ్ ప్రక్రియను దృష్టిలో పెట్టుకొని వైఎస్ఆర్ జిల్లా వ్యాప్తంగా 93 టీచర్ ఎమ్మెల్సీ పోలింగ్ స్టేషన్స్ అదే విధంగా 38 పట్టభద్రుల ఎమ్మెల్సీ పోలింగ్ స్టేషన్స్ మొత్తంగా 131 కేంద్రాలలో పోలింగ్ ప్రక్రియ నిర్వహించబోతున్నామన్నారు. రెండవ శిక్షణ కార్యక్రమం ఈ నెల 10వ తేదీన కూడా ప్రతి ఒక్కరు హాజరు కావలసిందిగా ఆ శిక్షణ కార్యక్రమం ద్వారా మరొకసారి పూర్తి అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో బద్వేలు ఆర్‌డిఒ వెంకటరమణ, జిల్లా సమగ్ర శిక్ష ప్రాజెక్టు అధికారి డాక్టర్ అంబవరం ప్రభాకర్‌రెడ్డి, జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారి దీప్తి, పాల్గొన్నారు.

ప్రభుత్వ బాలుర వసతి గృహంలో జడ్జి తనిఖీ

ప్రజాశక్తి - కడప

జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ సెక్రటరీ సీనియర్ సివిల్ జడ్జి ఎస్.కవిత బుధవారం ప్రభుత్వ బాలుర వసతి గృహం, ప్రభుత్వ పరిశీలన గృహం, చౌడమ్మ వృద్ధాశ్రమాన్ని సందర్శించారు. అక్కడ వారికి అందుతున్న వసతులు, సదుపాయాలను స్వయంగా పరిశీలించారు. పిల్లలకు అందుకున్న వసతి సదుపాయాలు అడిగి తెలుసుకున్నారు. రిజిస్టర్లను పరిశీలించారు. జాతీయ న్యాయ సేవాధికార సంస్థ వారి బాలల సంరక్షణ కొరకు స్నేహపూర్వక న్యాయ సేవలు పథకం 2015 వివరించారు. పిల్లల పట్ల ఎప్పటికప్పుడు తగు జాగ్రత్త వహించాలని ఆదేశించారు. ఉచిత న్యాయ సహాయం గురించి వివరించారు. చౌడమ్మ వృద్ధాశ్రమంలో వృద్ధులకు తగు సూచనలు సలహాలు ఇచ్చారు. చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందరేగా మాట్లాడుతూ తల్లిదండ్రులు, వయోవృద్ధుల పోషణ మరియు సంక్షేమ చట్టం 2007, ఆంధ్రప్రదేశ్ తల్లిదండ్రుల వయోవృద్ధుల పోషణ సంక్షేమ నియమావళి 2011ను వివరించారు. సంరక్షణ, భద్రత కల్పించవలసిన వృద్ధులను విడిచిపెట్టిన, పరిత్యాగం చేసే విధంగా బుద్ధిపూర్వకంగా వ్యహరించిన అట్టివారు శిక్షార్హులు అవుతారని అన్నారు. శిక్షాకాలం గరిష్టంగా మూడు నెలలు జైలు శిక్ష లేదా అపరాధ రుసుము గరిష్టంగా ఐదు వేల రూపాయలు లేదా రెండింటినీ కలిపి విధించ వచ్చన్నారు. అర్హులు తగిన సమాచారం కొరకు, సూచనలకు మరియు న్యాయ సేవలకు ప్రతి ఆర్డీవో ఆఫీసులో సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో బాలుర వసతి గృహం సూపరింటెండెంట్, పిల్లలు పాల్గొన్నారు.

రేపు జిల్లా కాంగ్రెస్ పార్టీ సమావేశం

ప్రజాశక్తి - కడప

ఈ నెల మూడో తేదీ కడప జిల్లా కాంగ్రెస్ సమావేశం పులివెందుల నియోజకవర్గంలోని వేంపల్లిలో డాక్టర్ నరెడ్డి తులసిరెడ్డి అధ్యక్షతన జరుగుతుందని డిసిసి అధ్యక్షులు నీలిశ్రీనివాసరావు తెలిపారు. ఈ సమావేశానికి పార్టీ శ్రేణులు నాయకులు కార్యకర్తలు అనుబంధ సంఘాల నాయకులు ప్రతి ఒక్కరూ హాజరుకావాలన్నారు.

కుష్టు వ్యాధి నివారణకు ఇంటింటి సర్వే

- జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ నాగరాజు

ప్రజాశక్తి-కడప అర్బన్

కుష్టు వ్యాధి నివారణ కోసం ఇంటింటి సర్వే కార్యక్రమాన్ని ఈ నెల ఈ నెల 21వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ కె.నాగరాజు పేర్కొన్నారు. బుధవారం నాగరాజుపేట పట్టణ ఆరోగ్య కేంద్ర పరిధిలోని నాగరాజుపేట-2 సచివాలయాన్ని సందర్శించి అక్కడ ఇంటింటి సర్వే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు ఎవరికైనా స్పర్శ లేని మచ్చలు, చర్మంపై రాగి రంగు మచ్చలు, పొడలు, లావుగా మారిన, నొప్పితో కూడిన నరాలు, కాళ్ళు లేదా చేతుల కండరాలలో బలహీనత, చేతులు, పాదాలు నరములలో తిమ్మిర్లుగా అనిపిస్తే సమీపములో ఉన్న ఆశాను కాని, ఎఎన్‌ఎంను సంప్రదించాలని పేర్కొన్నారు. సమీప పట్టణ ఆరోగ్య కేంద్రానికి వెళ్ళి డాక్టర్ వద్ద పరీక్ష చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు జిల్లా వైద్యాధికారి డాక్టర్ ఎస్‌కె. ఖాదర్‌వల్లి, డాక్టర్ బషీర్ అహ్మద్, పారా మెడికల్ అధికారి ఎ.నాగన్న, ఫిజియో థెరపిస్ట్ డాక్టర్ విక్టర్ మనోహర్, సూపర్ వైజర్ రామంజనమ్మ, ఆశాలు, ఎఎన్‌ఎంలు, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆడపిల్లల శాతాన్ని పెంచేందుకు కృషి చేయాలి : జెసి

ప్రజాశక్తి - కడప అర్బన్

సమాజంలో ఆడపిల్లల శాతాన్ని పెంచేందుకు ప్రతి ఒకరూ కృషి చేయాలని, లింగ వివక్షతను చూపే వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని జాయింట్ కలెక్టర్ సి.ఎం.సాయి కాంత్ వర్మ సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం స్థానిక కలెక్టర్ కార్యాలయంలోని స్పందన సమావేశ మందిరంలో గర్భిణి శిశు లింగ నిర్ధారణ, మాతా శిశు మరణాల నిర్మూలనపై సంబంధిత అధికారులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ బాలల లింగ నిష్పతిని గమనిస్తే.. బాలురతో పోలిస్తే బాలికల శాతం చాలా తక్కువగా ఉందన్నారు. ఈ అసమానత బాలికల సెక్స్ రేషియోను అధికంగా పెంచడానికి అధికారులు, ఎన్జీవోలు, ప్రజలు అందరినీ భాగస్వామ్యం చేయడమే ఈ పిసి పీఎన్డిటీ కమిటీ ప్రధాన ఉద్దేశ్యం అన్నారు. కడప జిల్లాలో ఎక్కడయినా "లింగ వివక్ష" జరుగుతోందని, బాధితురాలు కానీ, కుటుంబ సభ్యులు కానీ, ఇతరులు కానీ.. తగు ఆధారాలతో తమ ద ృష్టికి తీసుకు వస్తే వారికి పారితోషికాన్ని అందజేస్తామని తెలిపారు.



గిరి ప్రదక్షిణలో పాల్గొన్న పీఠాధిపతి, ఎమ్మెల్యే

గిరి ప్రదక్షిణ శుభకరం

- పుష్పగిరి పీఠాధిపతి విద్యా శంకర్ భారతి

ప్రజాశక్తి - వల్లూరు

పవిత్ర పుణ్యక్షేత్రం పుష్పగిరి చుట్టూ గిరి ప్రదక్షిణ చేయడం శుభకరం కలుగుతుందని పుష్పగిరి మఠం పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ విద్యా శంకర భారతి అన్నారు. బుధవారం మండలంలోని పుష్పగిరిలో ఉదయం నుంచి పీఠాధిపతి ప్రత్యేక పూజలు నిర్వహించి 11 కిలోమీటర్ల మేర కొండ చుట్టూ గిరి ప్రదక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా పీఠాధిపతి మాట్లాడుతూ ఎంతో పురాతన చరిత్ర కలిగిన పుష్పగిరిలో వైద్యనాథేశ్వరుడు ఉండడం బ్రహ్మ, విష్ణుమహేశ్వర కొలువైన ఉన్న పుష్పగిరికి ప్రదక్షిణ చేస్తే మంచిదన్నారు. కార్యక్రమంలో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని గిరిప్రదక్షిణను విజయవంతం చేశారు. అనంతరం కమలాపురం ఎమ్మెల్యే రవీంద్రనాథ్ రెడ్డి పవిత్ర పుణ్యక్షేత్రం పుష్పగిరిలో శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పీఠాధిపతితో కలిసి కొంత దూరం ప్రదక్షిణ చేసి పీఠాధిపతి ఆశీస్సులు పొందారు.

మహిళలు క్రికెట్‌లో రాణించాలి

ప్రజాశక్తి - కడప

మహిళలు చదువుతోపాటు క్రికెట్‌లో జిల్లా తరపున రాణించి ఉన్నత స్థాయి క్రికెట్‌కు చేరుకోవాలన్న లక్ష్యంతోనే జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్కూలు విద్యార్థినులకు ప్రత్యేక శిక్షణ ఇస్తున్నట్లు అసోసియేషన్ ప్రతినిధి విష్ణుమోహన్‌రావు అన్నారు. బుధవారం జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మహిళా క్రికెట్ అభివృద్ధిలో భాగంగా కడపలోని వైయస్ రాజారెడ్డి ఎసిఎ స్టేడియంలో మున్సిపల్ కార్పొరేషన్ ఉర్దూ హైస్కూల్ విద్యార్థినులకు క్రికెట్‌లో ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. బ్యాటింగ్, బౌలింగ్‌లో ప్రత్యేక శిక్షణను ఇచ్చారు. కార్యక్రమంలో స్కూలు ఫిజికల్ డైరెక్టర్ సాజిత్ పాల్గొన్నారు.



క్రికెట్ శిక్షణకు హాజరైన ఉర్దూ పాఠశాల విద్యార్థినులు

గజ్జల మెటర్నటీ ఆస్పత్రి ప్రారంభం

ప్రజాశక్తి-కడప అర్బన్



ఆస్పత్రిని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రవిరెడ్డి

వైద్య సేవకు మించిన సేవ లేదని గజ్జల మెటర్నటీ వైద్యశాల ప్రారంభో త్సవంలో డిప్యూటీ సిఎం అంజాద్‌బాషా, నగర మేయర్ సురేష్ బాబు, కమలాపురం ఎమ్మెల్యే రవీంద్ర నాథ్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం ఎన్జీవో కాలనీలో డాక్టర్ శకుంతల, జి.మధుసూదన్‌రెడ్డి ఆధ్వర్యంలో గజ్జల మెటర్నిటీ ఆస్పత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అత్యాధునిక వసతులతో కార్పొరేట స్థాయిలో వైద్యశాలను నిర్మించడం అభినందనీయమని పేర్కొన్నారు. అనంతరం గర్భిణి వైద్య నిపుణులు డాక్టర్ శకుంతల మాట్లాడుతూ ఇదివరకు శంకరాపురంలో వైద్య సేవలు అందించే వారమని తెలిపారు. ఇప్పుడు కడప నగరంలోని ఎన్జీవో కాలనీలో అత్యాధునిక టెక్నాలజీతో పరికరాలతో అత్యవసర కేసులు అన్ని చూడబడునని పేర్కొన్నారు. నూతనంగా ప్రారంభించిన వైద్యశాలలో అడ్వాన్స్ ప్రెగ్నెన్సీ టెస్ట్ బేబీ వైద్యాన్ని కోర్సులవారీగా నిర్వహిస్తామన్నారు. సంతానం లేని వారికి ప్రత్యేక వైద్యం కలగన్నారు. కార్యక్రమంలో సాయి మహేష్, సుధాకర్ రెడ్డి, మల్లికార్జున రెడ్డి, ప్రముఖ డాక్టర్లు, వైసిపి నాయకులు, నగర ప్రముఖులు పాల్గొన్నారు.

11న వ్యాసరచన, క్విజ్ పోటీలు

ప్రజాశక్తి - కడప అర్బన్

విద్యార్థినుల్లో ప్రతిభ వెలికి తీసి సమాజం, సామాజిక అంశాలపట్ల, దేశ సంస్కృతి, చరిత్ర పట్ల వారికి అవగాహన కల్పించి వ్యక్తిత్వ వికాసం పెంపొందించేందుకు నగరంలోని యుజి, పిజి కళాశాల విద్యార్థినులకు రెడ్డి సేవా సమితి ఆధ్వర్యంలో ఈ నెల 11న వక్తృత్వ, వ్యాసరచన, క్విజ్ పోటీలు నిర్వహిస్తున్నట్లు సమితి ప్రధాన కార్యదర్శి లెక్కల కొండారెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పోటీకి అమ్మాయిలు మాత్రమే అర్హులని తెలిపారు. ఆసక్తిగల వారు ఈ నెల 5లోపు విద్యార్థిని పేరు, కాలేజీ పేరు, సెల్ నంబరు వివరాలతో సమితి కార్యాలయంలో స్వయంగా, వాట్సప్ నంబరు 9440651284, 9440523484 కు పంపాలని పేర్కొన్నారు. 10న ప్రిలిమినరీ రౌండ్ ఉంటుందని తెలిపారు.విజేతలకు 12న బహుమతి ప్రదానం ఉంటుందని పేర్కొన్నారు. మొదటి బహుమతి రూ.5వేలు, రెండవ బహుమతి రూ.4వేలు, మూడవ బహుమతి రూ.3వేలు, కన్సోలేషన్ బహుమతి ముగ్గురికి రూ.500 చెప్పున ఇస్తామని తెలిపారు.

ప్రాక్టికల్స్‌కు 128 మంది గైర్హాజరు

ప్రజాశక్తి - కడప అర్బన్

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఇంటర్మీడియట్ పబ్లిక్ ప్రాక్టికల్ పరీక్షలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయి. బుధవారం 64 పరీక్ష కేంద్రాల్లో 4,382 మంది విద్యార్థులు ప్రాక్టికల్ పరీక్షలు రాయాల్సి ఉండగా 4,254 మంది రాశారు, 128 గైర్హాజరయ్యారు. రాష్ట్ర పరిశీలకులు రమణ గుప్తా, డివిఇఒ శ్రీనివాసులరెడ్డి పరీక్షా కేంద్రాలను తనికీ చేశారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని పరీక్ష కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్స్‌కు ఆదేశాలు ఇచ్చారు.


రాష్ట్రస్థాయికి ఎంపికైన ప్రాజెక్టును పరిశీలిస్తున్న సర్పంచు శ్రీనివాసులురెడ్డి

విద్యార్థులకు సర్పంచు అభినందన

ప్రజాశక్తి - చాపాడు

మైక్రో ఇన్నోవేటివ్ ప్రాజెక్టులో భాగంగా జిల్లాలో మొత్తం 4,525 ప్రాజెక్టులు చేయగా, అందులో మండలంలోని మొరాయిపల్లి ప్రాథమిక పాఠశాలలో పనిచేయుచున్న ఎం.నాగలక్ష్మి దేవి తయారు చేసిన బేసిక్ మ్యాథమెటిక్స్, పర్సెంటేజ్ టిఎల్ఎం ప్రాజెక్టు జిల్లా స్థాయి నుండి రాష్ట్రస్థాయికి ఎంపికైంది. అంతేకాక రాష్ట్రస్థాయిలో 26 జిల్లాల నుండి వచ్చిన ప్రాజెక్టుల నుండి మొదటి 15 ప్రాజెక్టులు ఎంపిక చేయగా, అందులో కూడా ఒక ప్రాజెక్టుగా ఎంపికైంది. ఈ సందర్భంగా గ్రామ సర్పంచు వై.శ్రీనివాసులరెడ్డి ఉపాధ్యాయులను అభినందించారు. అనంతరం సర్పంచు మాట్లాడుతూ నాగలక్ష్మిదేవి ఎంతో వినూత్నంగా ఆలోచించారన్నారు. విద్యార్థులు ప్రాథమిక దశలో గణితంలో ఎదుర్కొనే సమస్యలను గుర్తించి, వాటిని పరిష్కరించడానికి ఎంతో చక్కగా పర్సెంటేజ్ టిఎల్ఎం ఏర్పాటు చేయడం మంచి విషయమన్నారు. వృత్తిపట్ల ఉండే అంకితభావం, నిబద్ధత అభినందనీయమని తెలిపారు. ఇలాంటి మరిన్ని ప్రాజెక్టులు తీసుకురావాలని ఆయన ఆకాంక్షించారు.


రికార్డులను పరిశీలిస్తున్న కమిషనర్ నరసింహారెడ్డి

పన్ను వసూళ్లపై దృష్టి పెట్టాలి

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

పులివెందుల పురపాలక పరిధిలోని ఆస్తి, నీటి పనులపై దృష్టి సారించాలని సచివాలయ సిబ్బందికి కమిషనర్ నరసింహారెడ్డి సూచించారు. బుధవారం ఆయన పలు సచివాలయాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సిబ్బంది హాజరుపట్టిక, సచివాలయం సిబ్బంది మూవ్‌మెంట్ రిజిస్టర్‌ను పరిశీలించారు. సచివాలయంలో జరుగుతున్న ఆధార్ సేవలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం రెవెన్యూ సిబ్బందితో కలిసి ఆస్తి పన్ను వసూళ్ల కార్యక్రమంలో పాల్గొన్నారు. పన్ను వసూళ్ల వేగవంతం చేసి వంద శాతం లక్ష్యాన్ని సాధించాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ ఆర్ఐ రఘునాథరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

మాజీ కౌన్సిలర్‌పై దాడి హేయమైన చర్య

- పరామర్శించిన ఎమ్మెల్యే రాచమల్లు

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

మాజీ కౌన్సిలం పై టిడిపి నాయకులు దాడి చేయడం హేయమైన చర్య అని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. ఎలక్ట్రానిక్ మీడియాలో వచ్చిన వార్తను వైసిపి నేత, మాజీ కౌన్సిలర్ అగ్గారపు శ్రీనివాసులు పోస్టు చేస్తే దానిపై టిడిపి మైనార్టీ నాయకులు రాత్రివేళ వారి ఇంటిపై మూకుమ్మడి దాడి చేసి కర్రలతో చితకబాది, మహిళలని చూడకుండా అసభ్యంగా ప్రవర్తించడం అత్యంత దారుణమని ఆగ్రహం వ్యక్తం చేశారు. గాయపడి ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న అగ్గారపు శ్రీనివాసులు, వారి కుటుంబ సభ్యులను బుధవారం ఎమ్మెల్యే పరామర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ టిడిపి మైనార్టీ నేత కుతుబుద్దీన్ వారి అనుచరులు ఇంటిపై దాడి చేయడాన్ని ఖండిస్తున్నామన్నారు. దీనిపై పోలీసులు వీడియోను పరిశీలించి ఆ ఘటనకు బాధ్యులైన వారిని గుర్తించి, చట్టపరంగా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే కోరారు. ఎమ్మెల్యే వెంట పోరెడ్డి నరసింహారెడ్డి, కాకర్ల నాగేశ్వరరెడ్డి, కౌన్సిలర్ గారిశపాటి లక్ష్మీదేవి ఉన్నారు.


గాయపడిన మాజీ కౌన్సిలర్ శ్రీనివాసులు

రేపు మెగా వైద్య శిబిరం

- ప్రముఖ కీళ్ల మార్పిడి శస్త్ర చికిత్స నిపుణులు డాక్టర్ మహేష్ బ్యంగి

ప్రజాశక్తి - కడప సిటీ

నగరంలోని ఎర్రముక్కపల్లి జార్జిరెడ్డి వీధిలో స్టేట్ బ్యాంకు పక్క సందులో పాత కొమ్మా హాస్పిటల్ బిల్డింగ్‌లోని ప్రైమ్ హాస్పిటల్‌లో మెగా వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ప్రముఖ కీళ్ల మార్పిడి శస్త్రచికిత్స నిపుణులు డాక్టర్ మహేష్ బ్యంగి తెలిపారు. ఆ మేరకు ఆయన బుధవారం 'ప్రజాశక్తి'తో మాట్లాడుతూ కన్సల్టేషన్ ఫీజు పూర్తిగా ఉచితమన్నారు. రూ.3000 విలువగల ఎముకల సాంద్రత పరీక్ష కేవలం రూ.100మాత్రమే అన్నారు. డిజిటల్ ఎక్స్ రే పరీక్షలు పూర్తిగా ఉచితమన్నారు. దీర్ఘకాలిక నడుము నొప్పి, సయాటికా, నరాల బలహీనత, నరాల సమస్యలు, మెడ నొప్పులు(స్పాండిలైటిస్), కీళ్ల వాతం, షుగర్ పేషంట్లకు వచ్చు భుజం నొప్పి, విరిగిన, అతకని ఎముకల సమస్యలు ప్రత్యేకంగా చూస్తామన్నారు. మోకాలి అరుగుదలపై అవగాహన, ఎక్సర్‌సైజెస్, తీవ్రత అనుసరించి ప్రత్యేక సూది చికిత్స కలదని ఆయన వివరించారు. 100 రిజిస్ట్రేషన్ల వరకు మాత్రమే చూస్తామన్నారు. మెగా వైద్య శిబిరంలో మీ పేరు నమోదు చేసుకొనుటకు 93818 40632, 93980 08129 నంబర్లకు ఫోన్ చేయాల్సి ఉందన్నారు.



అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

అధిక ధరలకు మాంసం విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ జగన్నాథ్ హెచ్చరించారు. స్థానిక నగర పంచాయతీ కార్యాలయంలో బుధవారం ఆయన మాంసం విక్రయదారులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ మాంసం అధిక ధరలకు విక్రయిస్తున్నారని ప్రజలు ఫిర్యాదు చేశారన్నారు. మాంసం విక్రయంలో నాణ్యత ప్రమాణాలు పాటించాలన్నారు. అధిక ధరలకు అమ్మినా, నాణ్యతా ప్రమాణాలు పాటించకపోయినా క్రమశిక్షణ చర్యల్లో భాగంగా దుకాణాన్ని సీజ్ చేస్తామన్నారు. సమావేశంలో ఆర్ఓ గంగిరెడ్డి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ మధు, ఎఇ సందీప్, శానిటరీ సెక్రటరీలు, మాంసం షాపుల యజమానులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి

ప్రజాశక్తి - పెండ్లిమర్రి

తన సొంత వ్యవసాయ పొలంలో పని చేస్తుండగా విద్యుత్ షాక్ గురై సిరిగిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి (65) అనే రైతు మృతి చెందిన ఘటన మండలంలోని మొయిల్లకాలువ గ్రామంలో బుధవారం ఉదయం చోటుచేసుకుంది. సంఘటనపై కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రాజారాజేశ్వర్‌రెడ్డి తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం కడప రిమ్స్‌కు తరలించారు.


సంఘటనాస్థలంలో విచారిస్తున్న పోలీసులు

నాణ్యమైన విద్యుత్ అందిస్తాం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - ఖాజీపేట

రాష్ట్ర ప్రభుత్వం రైతులకు నాణ్యమైన విద్యుత్ అందిస్తామని మైదుకూరు ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి పేర్కొన్నారు. మండలంలోని కూనవారిపల్లి గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేయనున్న విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణానికి బుధవారం ఆయన భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం అభివృద్ధి కార్యక్రమాలకు పెద్దపీట వేస్తోందన్నారు. కార్యక్రమంలో కూనవారిపల్లె సర్పంచు భూమన సుబ్బారెడ్డి, ఎపిఐఎసి రాష్ట్ర డైరెక్టర్ గంగాధర్‌రెడ్డి, ఎంపిపి అబుబకార్ సిద్ధిక్, అగ్రహారం సహకార సంఘం అధ్యక్షుడు పివి రాఘవరెడ్డి, బోరు గంగాధర్‌రెడ్డి, వైసిపి మండల కన్వీనర్ మురళీమోహన్‌రెడ్డి, కాంట్రాక్టర్ భరత్‌కుమార్‌రెడ్డి, కొత్తపేట గోపాల్‌రెడ్డి, రావులపల్లి ఎంపిటిసి సభ్యులు కనపర్తి సుబ్బారెడ్డి, పుల్లూరు నాగేశ్వర్‌రెడ్డి, మండల పరిషత్ కో-ఆప్షన్ సభ్యులు మున్వర్ హుస్సేన్ పాల్గొన్నారు.


సబ్‌స్టేషన్ నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే రఘురామిరెడ్డి

ప్రతిపక్షాలు పెత్తందారుల వైపు అనడం హాస్యాస్పదం : పిసిసి

ప్రజాశక్తి - వేంపల్లె

రాబోవు ఎన్నికల్లో పేదలు ఒక వైపు.. పెత్తందారులు మరోవైపు.. అందులో పేదల వైపు తాను ఉన్నానని.. పెత్తందారుల వైపు ప్రతిపక్షాలు ఉన్నాయని సిఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చెప్పడం హాస్యాస్పదమని పిసిసి మీడియా సెల్ చైర్మన్ ఎన్.తులసిరెడ్డి పేర్కొన్నారు. స్థానికంగా బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ బొంకరా బొంకరా పోలిగా అంటే టంగుటూరి మిరియాలు తాటికాయంత అన్నట్లు సిఎం జగన్ వాలకమి విమర్శించారు. 2019లో సమర్పించిన ఎన్నికల అఫిడవిట్ ప్రకారం ప్రస్తుతం దేశంలో ఉన్న ముఖ్యమంత్రుల్లో అత్యంత ధనవంతుడు జగన్‌రెడ్డి, అత్యంత పేదరాలు మమతా బెనర్జీ అన్నారు. ఆ ప్రకారం జగన్‌రెడ్డి ఆస్తి రూ.370 కోట్లు కాగా, మమతా బెనర్జీ ఆస్తి విలువ రూ.25 లక్షలు అన్నారు. ముఖ్యమంత్రి అయిన తర్వాత జగన్ అక్రమ సంపదకు అడ్డూ అదుపూలేదని ఆరోపించారు. వైట్, బ్లాక్ మనీ కలిపితే ప్రస్తుతం జగన్ ఆస్తి విలువ అదానీ, అంబానీ ఆస్తుల కంటే ఎక్కువగా ఉండడంలో అతిశయోక్తి లేదన్నారు. మాట తప్పడం మడమ తిప్పడం జగన్ దినచర్యగా మారిందని విమర్శించారు. అధికారంలోకి వచ్చిన మరుక్షణమే విశ్వసనీయతను కోల్పోయినట్లు చెప్పారు. జగన్ దృష్టిలో మేనిఫెస్టో ఒక చిత్తు కాగితమన్నారు. నవరత్నాలకే దిక్కులేదన్నారు. రైతు భరోసా నిరాశ పథకంగా మారిందన్నారు. రైతులకు గిట్టుబాటు ధరలు కూడ లేదన్నారు. సున్నా వడ్డీ పథకం 10 శాతం రైతులకే వర్తించిందని పేర్కొన్నారు. 25 లక్షలు ఇళ్లకుగానూ 25 వేలు కూడా నిర్మించలేదని విమర్శించారు. నిధులు లేక జలయజ్ఞం నీరసించిందన్నారు. మద్యపాన నిషేధం కాస్త మద్యపాన నిషా పథకంగా మారిందని విమర్శించారు. ఇకనైనా పచ్చి అపద్దాలు చెప్పడం మానుకోవాలని సిఎంకు తులసిరెడ్డి సూచించారు.

రోడ్ల నిర్మాణాలపై గ్రామసభ నిర్వహించాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఓఎస్‌డి అనిల్‌కుమార్‌రెడ్డి

ప్రజాశక్తి పులివెందుల రూరల్

పులివెందుల నియోజకవర్గంలో రైతులు పంట ఉత్పత్తులను తరలించేందుకు అనువుగా పంట పొలాల నుండి ప్రధాన రహదారులకు అనువైన చోట గ్రావెల్ రోడ్ల నిర్మాణాలపై ఈనెల 5వతేదీతోపు గ్రామసభలు నిర్వహించాలని ఓఎస్‌డి అనిల్‌కుమార్‌రెడ్డి సూచించారు. స్థానిక పురపాలక సభాభవనంలో బుధవారం ఆయన అన్నిశాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్ల ఎంపికపై గ్రామసభలు, తీర్మానాలు తీసుకొని నివేదికలను పాడా కార్యాలయానికి పంపాలన్నారు. అరటి, బొప్పాయి, చీని వంటి పండ్ల తోటలకు అవసరం ఉన్న చోట గ్రావెల్ రోడ్లను నిర్మించాలన్నారు. లింకు రోడ్డుని కలుపుతూ పంట పొలాలకు గ్రావెల్ రోడ్ల నిర్మాణాలకు ప్రణాళికలను సిద్ధం చేయాలన్నారు. పులివెందుల మున్సిపాలిటీలో జరుగుతున్న అభివృద్ధి పనులను నిర్ణీత గడువులో పూర్తి చేసేందుకు ఆయా శాఖల అధికారులు కృషి చేయాలని ఆయన ఆదేశించారు. నిత్యం ఆ పనులను అధికారులు పర్యవేక్షిస్తూ ఉండాలన్నారు. కార్యక్రమంలో పీడీ యదుభూషణ్‌రెడ్డి, రోడ్లు భవనాల శాఖ ఇఇ సిద్ధారెడ్డి, పిఆర్ ఇఇ ఓబుల్‌రెడ్డి, డిఇ సుధాకర్‌రెడ్డి, ఎంపిడిఓ రాజశేఖం రెడ్డి, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

జామియా మసీదు ఆస్తులను పరిరక్షిస్తాం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

స్థానికంగా అతిపురాతనమైన జామియా మసీదు ఆస్తులను పరిరక్షిస్తామని ఎమ్మెల్యే రాచమల్లు ప్రసాదరెడ్డి తెలిపారు. మసీదుకు సంబంధించిన సమస్యల పరిష్కారం కోసం బుధవారం ముస్లిం మతపెద్దలతో కలిసి మసీదు పరిసరాలను, శ్వశానవాటికను పరిశీలించారు. అనంతరం ఆయన మట్లాడుతూ పట్టణ జనాభా పెరగడం వల్ల సౌకర్యాలను కూడా పెంచాల్సిన అవసరం ఉందన్నారు. మనిషి చివరి, శాశ్వత మజిలీ అయిన శ్మశానవాటికను అభివృద్ధి చేయాల్సి ఉందన్నారు. రోడ్లు, విద్యుత్, నీటి సౌకర్యం కల్పించాలన్నారు. ప్రస్తుతానికి పాలకమండలి లేకపోవడం వల్ల సమస్యలొస్తున్నాయని తెలిపారు. త్వరలో అందరి ఆమోదంతో పాలక మండలిని నియమిస్తామన్నారు. ఈ ప్రాంతంలో ట్రాఫిక్ అస్తవ్యస్తంగా తయారైందని, దీన్ని క్రమబద్ధీకరించాలన్నారు. రంజాన్ పండుగలోగా మసీదు అభివృద్ధి పనులను పూర్తి చేస్తామన్నారు. కార్యక్రమంలో స్థానిక ముస్లిం మతపెద్దలు పాల్గొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తలపెట్టిన 'గడపగడపకూ మన ప్రభుత్వం' కార్యక్రమం రాష్ట్రంలోనే ప్రొద్దుటూరు నియోజకవర్గం మొదటి స్థానం సాధించిందని, ఇందుకు ఎమ్మెల్యే రాచమల్లు ప్రసాదరెడ్డి కారణమని కౌన్సిలర్లు ప్రశంసించారు. ఇందుకు అభినందనగా బుధవారం మున్సిపల్ కార్యాలయంలో కౌన్సిలర్లు ఎమ్మెల్యేను సన్మానించారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ లక్ష్మీదేవి, కౌన్సిలర్లు పాల్గొన్నారు.


ఎమ్మెల్యేను సన్మానిస్తున్న కౌన్సిలర్లు

మహిళలు కుట్టు శిక్షణతో ఉపాధి పొందాలి


కుట్టు శిక్షణ కేంద్రాన్ని ప్రారభిస్తున్న జడ్‌పిటిసి రవికుమార్‌రెడ్డి

ప్రజాశక్తి - వేంపల్లె

కుట్టు శిక్షణతో మహిళలు ఉపాధి పొందాలని జడ్‌పిటిసి రవికుమార్‌రెడ్డి, ఎంపిపి లక్ష్మి గాయత్రి, వైసిపి మండల కన్వీనర్ చంద్రఓబుల్‌రెడ్డి పేర్కొన్నారు. స్థానిక గరుగువీధిలో గంగ రూరల్ ఇన్విరాల్మెంట్ అండ్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత కుట్టు శిక్షణ కేంద్రాన్ని బుధవారం వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉచిత కుట్టు శిక్షణను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మండలంలోని ఆయా గ్రామాల్లో మహిళలకు ఉచితంగా కుట్టు శిక్షణనిస్తారన్నారు. మహిళలు ఇంటోనే ఉంటూ ఇతర పనులు చేసుకొంటూ కూడా కుట్టుమిషన్‌తో డబ్బులు సంపాదించవచ్చునని తెలిపారు. చదువుకొని ఇంట్లో ఉన్న బాలికలు కూడా కుట్టు శిక్షణ పొందాలని సూచించారు. సంపాదించిన డబ్బులు విద్యార్థుల చదువుకు ఆసరాగా ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో గంగ రూరల్ ఇన్విరాల్మెంట్ అండ్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు శివకృష్ణ, సొసైటీ కన్వీనర్ గంగయ్య, కుట్టు శిక్షణ టీచర్ నాగమణి, మాజీ జడ్పీటీసీ షబ్బీర్, ఎంపిటిసిలు ప్రదీప్‌కుమార్‌రెడ్డి, అసనయ్య, సింగిల్ విండో మాజీ అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి, ఎస్సీ సెల్ మండల కన్వీనర్ జయరాం, పద్మ రాజ్‌కుమార్, భారతి మైనింగ్ డైరెక్టర్ సల్మా పాల్గొన్నారు.

రాయల్టీ వసూలు నిలిపివేత

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

నాపరాయి పరిశ్రమలకు సంబంధించిన యజమానులు బుధవారం స్థానిక వైసిపి కార్యాలయంలో ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డితో భేటీ అయ్యారు. నాపరాయి పరిశ్రమ యజమానులు మాట్లాడుతూ పాదయాత్రలో భాగంగా నాపరాయి పరిశ్రమకు సంబంధించి రాయల్టీని ఎత్తివేస్తామని వైయస్ జగన్ హామీ ఇచ్చారని గుర్తు చేశారు. కానీ ఇప్పుడు రాయల్టీల వసూలను హిల్ సైడ్ వ్యూ ఎల్ఎల్‌పి అనే ప్రైవేటు సంస్థకు కట్టబెట్టారని తెలిపారు. వారు నాపరాళ్లకు సంబంధించిన ట్రాక్టర్లను, లారీలను ఆపి ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఎమ్మెల్యే ఎదుట వాపోయారు. అనంతరం ఎమ్మెల్యే రాయల్టీ వసూలు చేస్తున్న సదరు సంస్థకు చెందిన ప్రతినిధులను పిలిపించి రాయల్టీకి సంబంధించిన డబ్బు వసూలు కొన్ని రోజులు ఆపాలని, ప్రభుత్వంతో చర్చలు జరిపి ఏదోక నిర్ణయం తీసుకుందామని కోరారు. సదరు సంస్థ ప్రతినిధులు దీనికి అంగీకరించి రెండు రోజులు గడువు ఇస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ హర్షవర్ధన్‌రెడ్డి, హిల్ సైడ్ వ్యూ ఎల్ఎల్‌పి సంస్థ ప్రతినిధులు, నాపరాయి పరిశ్రమ యజమానులు పాల్గొన్నారు.

ఉచిత డ్రైవింగ్ శిక్షణ తరగతులు ప్రారంభం

ప్రజాశక్తి - కమలాపురం

స్థానిక యువకులకు అభయ ఫౌండేషన్ ఆర్థిక సహకారంతో మదర్‌థెరిస్సా సేవా సమితి ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శ్రీ లక్ష్మి దుర్గ డ్రైవింగ్ శిక్షణ కేంద్రంలో ఉచితంగా శిక్షణనిస్తున్నట్లు ఆ ఫౌం డేషన్ వ్యవస్థాపకులు సంకు బాలచంద్ర తెలిపారు. ఆ మేరకు బుధవారం బుధవారం నెహ్రూ యువ కేంద్రం జిల్లా అధికారి మణికంఠ ఉచిత డ్రైవింగ్ శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా బాలచంద్ర మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతంలోని అర్హులైన పేద యువత నైపుణ్య శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. 16 మంది నిరుద్యోగులకు ఉచిత కారు డ్రైవింగ్ శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. శిక్షణకు ఎంపికైన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో మొదటిసారి ఛారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ జూటూరు విజయ్‌కుమార్, ఎస్‌కె ఛారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకుడు ఎస్‌కె ఎలిన్‌బాబు, జిఎస్‌పివి ట్రస్ట్ చైర్మన్ ఉమాదేవి పాల్గొన్నారు.


ఉచిత డ్రైవింగ్‌ను ప్రారంభించిన నిర్వాహకులు

వేంపల్లె : నిరుద్యోగుల కోసం చేపట్టిన ఉచిత డ్రైవింగ్ శిక్షణలో ట్రాఫిక్ రూల్స్‌ను పాటించాలని అభయ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు సుంకు బాలచంద్ర పేర్కొన్నారు. బుధవారం వేంపల్లెలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అభయ ఫౌండేషన్, చైతన్య మహిళా మండలి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత డ్రైవింగ్ శిక్షణను బాల చంద్ర ప్రారంభించారు. అలాగే 8,9,10 తరగతుల విద్యార్థులకు మోటివేషన్ క్లాసులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో చైతన్య మహిళా మండలి అధ్యక్షురాలు రామాంజనమ్మ, రీడో స్వచ్ఛంద సంస్థ అధ్యక్షులు ఈశ్వరయ్య, బిఎస్ఆర్ టెక్నికల్ డ్రైవింగ్ స్కూల్ కరస్పాండెంట్ నాగేంద్ర, మదర్‌థెరిస్సా చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకుడు విజయ్‌కుమార్, లెనిన్ బాబు, ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ సభ్యుడు నాగన్న, డ్రైవింగ్ స్కూల్ విద్యార్థులు పాల్గొన్నారు.

వైసిపి పాలనలో అభివృద్ధి శూన్యం

ఎర్రగుంట్ల : వైసిపి పాలనలో అభివృద్ధి శూన్యమని జమ్మలమడుగు టిడిపి ఇన్‌ఛార్జి చదిపిరాళ్ల భూపేష్ సుబ్బరామిరెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని చిర్రాజుపల్లి, దండుపల్లి, రంగసాయపురం, కర్చుకుంటపల్లి గ్రామాల్లో బుధవారం ఆయన ఇదేం కర్మ మన రాష్ట్రానికి కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలోని ప్రతి గడపకు తిరుగుతూ కరపత్రాలను పంపిణీ చేశారు. ప్రభుత్వ వైఫల్యాన్ని ప్రజలకు వివరించారు. రాబోవు సార్వత్రిక ఎన్నికల్లో టిడిపిని గెలిపించి రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిచేలా చేయాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

మాదిగ అమరవీరులకు ఘన నివాళి

జమ్మలమడుగు రూరల్ : ఎస్‌సి వర్గీకరణ జరపాలని మాదిగలతోపాటు ఉప కులాలకు న్యాయం జరగాలని ఉద్యమంలో అశువులుబాసిన మాదిగ అమరవీరులకు జాతి ఉద్యమం తరపున జోహార్లు తెలియజేస్తున్నామని ఎమ్ఎస్పీ రాష్ట్ర నాయకులు జంగాల మ్యూనిస్వామి తెలిపారు. బుధవారం మహాజన సోషలిస్టు పార్టీ ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహం వద్ద పూలమాల వేసి నివాళులర్పించారు. మహాజన సోషలిస్ట్ పార్టీ జిల్లా నాయకులు పాపోడ్, కోట సుబ్బయ్య, జమ్మలమడుగు మహాజన సోషలిస్ట్ పార్టీ మండల అధ్యక్షులు చింతకు రాముడు, పెద్దముడియం మహాజన సోషలిస్ట్ పార్టీ మండలాధ్యక్షుడు దస్తగిరి, వెంకటసుబ్బయ్య, రాజశేఖర్, ముద్దనూరు హరికృష్ణ, మంచాల ఓబులేసు, చవిటి బాలస్వామి, చెన్నప్ప, రామకృష్ణ ఉన్నారు.


పశువులకు టీకాలు వేస్తున్న డాక్టర్ శ్రీనివాస

పశువులకు టీకా తప్పనిసరిగా వేయించాలి

ప్రజాశక్తి - ముద్దనూరు

పశువులకు గాలికుంటు వ్యాధి సోకకుండా వాటికి టీకా తప్పక వేయించాలని మండల పశువైద్యాధికారి శ్రీనివాస సూచించారు. మండలంలోని కొత్తచౌటిపల్లె గ్రామంలో బుధవారం పశు వైద్య శాఖ ఆధ్వర్యంలో డాక్టర్ శ్రీనివాస పశువిజ్ఞాన బడి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ మూడు నెలలు దాటిన గేదెలు, దూడలు, ఆవులు, ఎద్లకు టీకాలు వేయించాలన్నారు. తద్వారా పశువులు వ్యాధి బారిన పడకుండా ఉంటాయన్నారు. 45 దూడలు, 56 గేదెలు, 18 ఆవులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేసినట్లు తెలిపారు. పశువిజ్ఞాన బడి కార్యక్రమంలో భాగంగా ఈ నెల 30 వరకు పాడి రైతుల ఇళ్ల వద్దనే పశువులకు టీకాలు వేయనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని రైతులు, పశు పెంపకందార్లు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో సిబ్బంది శివలింగేశ్వర్‌రెడ్డి, మేరీ, వీరేంద్ర పాల్గొన్నారు.

నవోదయకు విద్యార్థులు ఎంపిక

ప్రజాశక్తి - ఖాజీపేట

ఇటీవల విడుదలైన ఆల్ ఇండియా సైనిక్ స్కూల్ ప్రవేశ పరీక్షలో స్థానిక శ్రీ సాయి కోచింగ్ సెంటర్ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనపరిచినట్లు కోచింగ్ సెంటర్ నిర్వాహకులు పి.వి.విజయభాస్కర్‌రెడ్డి మంగళవారం తెలిపారు. ఈ ప్రవేశ పరీక్షలో రెండు తెలుగు రాష్ట్రాల్లో హడ్సన్ టెలర్ 300 మార్కులు గానూ ఎస్సీ కేటగిరి విభాగంలో 275 మార్కులు సాధించి మొదటి ర్యాంకు సాధించగా, బిసి కేటగిరి విభాగంలో వరదరాజన్‌కుమార్ 253 మార్కులు, బాలికల కేటగిరి బిసి విభాగంలో ప్రణీత 248 మార్కులు సాధించినట్లు చెప్పారు. వీరితోపాటు మరికొందరు ఉత్తమ మార్కులు సాధించినట్లు ఆయన వివరించారు. ఈ సందర్భంగా ఎంపికైన విద్యార్థులను కోచింగ్ సెంటర్ యాజమాన్యం, ఉపాధ్యాయులు అభినందించారు.

విద్యార్థులకు ఏకాగ్రత ఎంతో అవసరం

ప్రజాశక్తి - వల్లూరు

విద్యార్థులకు ఏకాగ్రత ఎంతో అవసరమని అభయ ఫౌండేషన్ వ్యవస్థాపకులు శ్రీబాల చంద్రస్వామి పేర్కొన్నారు. మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ విద్యాలయంలో మదర్ థెరిస్సా సేవా సమితి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ జూటూరు విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో బుధవారం పరీక్షలపై చర్చాకార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏకాగ్రతతో విద్యను అభ్యసిస్తే ఉన్నత శిఖరాలను అధిగమిస్తారని సూచించారు. పాఠశాల ప్రణాళికతోపాటు ప్రతి విద్యార్థి సొంత ప్రణాళిక నిర్వహించుకోవాలన్నారు. ఎప్పుడైతే విద్యార్థుల్లో ఒక నిర్దిష్టమైన లక్ష్యం ఉంటుందో అప్పుడు మాత్రమే సాధించగలరని అన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ నసీ మునిషా, ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.




మాట్లాడుతున్న పాఠశాల ప్రిన్సిపల్ నసీ మునిషా

కరుమూరి వెంకట రమణయ్య మృతి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు


సమాజసేవకుడు వివేకానంద సేవాసంస్థ అధ్యక్షుడు కరుమూరి వెంకటరమణయ్య(74) తిరుపతిలోని ఓ ప్రయివేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతి చెందారు. ఆయన కమ్యూనిస్టు పార్టీ కార్యకర్తగా ప్రారంభమై బిసి నాయకుడిగా టిడిపిలో పనిచేశారు. ఎలాంటి పదవులు ఆశించకుండా నిస్వార్థంగా సేవలందించారు. ఆయన నిరంతరం సామాజిక కార్యక్రమాలు చేసేవారు. ప్రముఖుల జయంతి, వర్ధంతి పురస్కరించుకొని తమ సేవాసంస్థ అధ్వర్యంలో విద్యార్థులకు నోటుపుస్తకాలు, పెన్నులు పంపిణీ చేసేవారు. అనాథవృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేసేవారు. సౌమ్యుడు, మితవాదిగా అయనకు పేరుంది. ఈ సేవాతత్పరుడికి అభిమానులు కన్నీటి వీడ్కోలు పలికారు. బుధవారం సాయంత్రం అంత్యక్రియలు నిర్వహించారు.


వెంకటరమణయ్య (ఫైల్‌ఫొటో)

ఆర్మీ జవాన్ రక్తదానం

ప్రజాశక్తి - పోరుమామిళ్ల టౌన్

రైట్ హ్యాండ్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో పోరుమామిళ్ల సీనియర్ జర్నలిస్టు పి.గురివిరెడ్డి 71వ జన్మదినోత్సవం సందర్భంగా యువ జవాన్ ఆరోసారి రక్తదానం చేశారు. కలసపాడు మండలం ముదిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన సుభద్ర అనే మహిళ ఓ ప్రైవేట్ హాస్పిటల్లో అనారోగ్యంతో చేరగా, వైద్యులు ఒ పాజిటివ్ రక్తం ఏర్పాటు చేసుకోవాల్సిందిగా సూచించారు. వనిపెంట గ్రామానికి చెందిన వెంకట రమణ అనే సైనికుడు రక్తదానం చేశారు. ఈ సందర్భంగా సీనియర్ జర్నలిస్టు పి.గురివిరెడ్డి మాట్లాడుతూ రైట్ హ్యాండ్ ఆర్గనైజేషన్ చేపట్టిన రక్త దానం అనే కార్యక్రమం ఎంతో బృహత్తరమైందన్నారు. ఫౌండర్స్ రసూల్, ప్రసాద్ గొప్ప కార్యక్రమం చేస్తున్నారని కొనియాడారు. వారు భవిష్యత్‌లో మరిన్ని సేవా కార్యక్రమాలు చేయాలని ఆకాంక్షించారు. అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా హాజరైన పలువురు విలేకరులు మాట్లాడుతూ విలువలతో కూడిన జర్నలిజం గురివిరెడ్డి చేశారని, ఆయన మరిన్ని జన్మదినోత్సవాలు జరుపుకోవాలని కోరుతూ శుభాకాంక్షలు తెలిపారు.


రక్త సంచిని అందజేస్తున్న దాత

5వ తరగతి ప్రవేశాలకు దరఖాస్తులు

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

మహాత్మాజ్యోతిబా పూలే వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల విద్యాలయాల్లో ప్రవేశాలకు జిల్లాలోని వనిపెంట, తొండూరు (బాలికలు), కమలాపురం, జమ్మలమడుగు (బాలురు) బాల, బాలికలకు 2023-2024 విద్యా సంవత్సరానికి సంబం ధించి 5వ తరగతి (ఆంగ్ల మాధ్యమంలో బోధన) ప్రకటన విడుదలైందని కడప జిల్లా కన్వీనర్ అండ్ ప్రిన్సిపల్ కెవిఎస్ రామ కృష్ణారెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తులను ఆన్‌లైన్‌లో రూ.100 చెల్లించాలన్నారు. ప్రవేశ పరీక్ష ఫలితాల ఆధారంగా రిజర్వేషన్, విద్యార్థుల ప్రతిభ ఆధారంగా సీట్ కేటాయించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. పూర్తి వివరాలకు సమీపంలోని ఎంజెపి గరుకుల పాఠశాలను సంప్రదించాలన్నారు.